క్లుప్తంగా

భారీ వాహనాల పార్కింగ్‌తో అవస్థలు



ఆటోనగర్ బి - బ్లాక్ ప్రధాన రోడ్డుపై పార్కింగ్ చేసిన ట్రక్‌లు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లోని బి – బ్లాక్ ప్రధాన రహదారిపై భారీ వాహనాల పార్కింగ్‌తో పాటు ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గంటలు, రోజుల తరబడి భారీ వాహనాలైన ట్రక్‌లను రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తున్న వాహనాల విషయంలో ఐలా సిబ్బంది చేతులు ఎత్తేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు.

తిరుమలేశునికి సహస్రనామార్చన



పూజలందుకున్న శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం రాత్రి తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. వృక్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడిని విశేష పుష్పాలతో అలంకరించారు.


విరివిగా మొక్కలు నాటాలి



బహుళ అంతస్తు ప్రాంతంలో మొక్కలు నాటుతున్న అసోసియేషన్ పతినిధులు

అగనంపూడి: ఖాళీ ప్రదేశాలతో పాటు పబ్లిక్ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలని జూబిలీ హిల్స్ ప్రాంతంలోని అన్నపూర్ణా బహుళ అంతస్తు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లవిల్లి వెంకటరావు, మురళీ అన్నారు. బహుళ అంతస్తు భవనం ప్రాంతంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పచ్చదనంతో నింపాలన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ కోసం పరిసరాల్లో చెట్లు విరివిగా పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ధర్మారావు, నరేంద్ర, ఎల్వీరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రనగర్ గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా బోర భాస్కరరావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా వి. నారాయణరావు, కార్యదర్శిగా డి. రమణ, కోశాధికారిగా కమలాకర్‌తో పాటు మరో 50 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీతో ప్రమాణం చేయించారు.

మద్యం దుకాణం ఎదుట వంటా వార్పు

అల్లిపురం: మాకొద్దు మద్యం షాపు అంటూ వారం రోజులుగా భూపేష్‌నగర్ వాసులు ఆందోళన చేస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం ఆందోళనకారులు మద్యం దుకాణం ఎదుట వంటా వార్పు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేసి తమ నిరసన తెలిపారు. వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమస్యల కూత!



నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం వైపు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు



మూసివేసిన రెండో మార్గం

- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వెళ్లడానికి, రావడానికి ఒకటే మార్గం
- రెండో దారి మూతపడి మూడేళ్లు
- సాయంత్రం ఏడు దాటితే మరుగుదొడ్లకు తాళాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అసౌకర్యాలు కూతపెడుతున్నాయి. ఏళ్ల తరబడి సమస్యలు పీడస్తున్నాయి. అమృత భారత్ కార్యక్రమంతో స్టేషన్ రూపురేఖలు మారుతాయని అంతా భావించారు. అయితే పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు.

వసతులపై శీతకన్ను

అమృతభారత్ కార్యక్రమంలో అభివృద్ధి చేయడానికి దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేశారు. దీనిలో భాగంగా అదనపు భవనాలు, ఇతర వాణిజ్య సముదాయాల నిర్మాణాలు సాగిస్తున్నా కనీస వసతుల విషయంలో మాత్రం అధికారులు శీతకన్ను వేశారు. నాలుగేళ్ల కిందట నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం పొడవు పెంచారు. ఇక్కడ లోపలికి ప్రవేశంచడానికి, బయటకు వెళ్లడానికి రెండు మార్గాలు అందుబాటులోఉండేవి. ఒకటి టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ఉండగా, రెండోది 20 మీటర్ల దూరంలో ఉండేది. ఈ రెండు మార్గాలు ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బంది ఉండేది కాదు.

దారి మూసివేతతో కష్టాలు

అధికారులు రెండో ద్వారాన్ని మూసి వేశారు. అప్పటి నుంచి ప్రధాన ద్వారం వెంబడి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఒక పక్క ఇరుగ్గా ఉండడం, మరో వైపుమార్గం మధ్యలో టికెట్ బుకింగ్ కౌంటర్, ఏటీఎంలు ఉన్నాయి. టికెట్ కోసం వేచి ఉండే ప్రయాణికులు దారి మధ్యలో నిల్చోడవడంతో ప్రయాణికులు లగేజీలు, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులతో పాట్లు పడాల్సి వస్తుంది. ద్వారం వెడల్పు కనీసం నాలుగు మీటర్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు తోపులాటగా వెళ్లాల్సి వస్తుంది. విజయవాడ వైపు నుంచి విశాఖ వచ్చే రత్నాచల్, జన్మభూమి, తిరుమల, గోదావరి, విశాఖ, సింహాద్రి రైళ్లకు 200 నుంచి 300 మంది ఇక్కడ దిగుతున్నారు. వీరంతా ఒకేసారి బయటకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో తోపులాటలు జరుగుతున్నాయి.

సమస్య తెలియజేసినా..

ఒకే ద్వారం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను కొన్నాళ్లుగా దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. రెండో మార్గం ఆవశ్యకతను వివరిస్తూ ట్విట్టర్, వినతిపత్రాలు, వాట్సాప్‌ల ద్వారా సమాచారం తెలియజేస్తున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదు.

మరుగుకూ అవస్థలే..

నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం వైపు సాయంత్రం ఏడు దాటితే ప్రయాణికులు పాట్లు పడాల్సిందే. ఒడిశా, పశ్చిమ బెంగాల్, శ్రీకాకుళం, పలాస, రాయగడ వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు వేచి ఉండాల్సి వస్తుంది. రాత్రి ఏడు దాటిన తర్వాత మరుగుదొడ్లు, విశ్రాంతి గదికి తాళాలు వేసేస్తున్నారు. దీంతో అత్యవసరమైతే ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పరుగులు తీయాల్సి వస్తుంది. లేదంటే మూత్ర, మల విసర్జన ఆరుబయటే కానిచ్చేయాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.



మూతపడిన మరుగుదొడ్లు

ప్రధాన గేటు ఇరుగ్గా ఉంది



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం ఇరుగ్గా ఉంది. ఈ గేటులోకి వరుసగా ఇద్దరు లగేజీలతో ప్రవేశిస్తే మరొకరు వస్తే తప్పుకోడానికి కూడా వీల్లేదు. రెండో ద్వారాన్ని మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే రైళ్ల నుంచి వందలాది మంది ప్రయాణికులు ఒకేసారి దిగడంతో ప్రవేశ ద్వారం వద్ద గలాటాగా మారిపోతుంది. అధికారులు స్పందించి మూసివేసిన రెండో మార్గాన్ని తెరిపించాలి.

–పీకేఎం లక్ష్మి, ఉక్కు కార్యదర్శి, రాజీవ్‌నగర్

మూసివేసిన దారి తెరవాలి



గతంలో ఉన్న మాదిరిగానే రెండో దారి వెంటనే తెరిపించాలి. ఒకేసారి లగేజీలతో పాటు ప్రయాణికులను తీసుకువెళ్లడానికి వచ్చేవారితో కిటకిట లాడుతోంది. ఈ సమయంలో కొద్దిపాటి గలాటా జరుగుతోంది. రైల్వే ఉన్నతాధికారులు సమస్యను అర్థం చేసుకొని ప్రయాణికులు ఇబ్బంది పడకుండా మూసివేసిన ద్వారం పునః ప్రారంభించాలి. నాలుగోనంబర్ ప్లాట్‌ఫారం వైపు మరుగుదొడ్లు రాత్రి వేళ అందుబాటులో ఉంచాలి.

–ఎంఎస్ఎన్‌మూర్తి, స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధి

నేడు స్టీల్‌ప్లాంట్‌లో మహాధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఈ ధర్నాకు పిలుపునిచ్చారు. ఉక్కు పరిశ్రమ సమస్యలపై సోమవారం దేశవ్యాప్తంగా సెయిల్‌తో పాటు స్టీల్‌ప్లాంట్ కార్మికులు సమ్మె చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమ్మె బదులు మహాధర్నా చేయాలని ఉక్కు కార్మిక సంఘాలు నిర్ణయించారు. ఆ మేరకు సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో ఉక్కు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందజేస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీలకు చెందిన మూడు నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె, ఇతర వంట సామగ్రి అందించింది. ఇద్దరు దినసరి కూలీలు మరణించడం, మరో ఇంటి యజమాని రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితం కావడంతో ఆదివారం ట్రస్ట్ మాజీ చైర్మన్ గంధోళి నరసింగరావు చేతుల మీదుగా సరకులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్వా రామ అప్పారావు, చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు జి.లోవరాజు, కిడిమి హనుమంతురావు, లక్కరాజు రాము పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు నడుపూరు విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ: వచ్చే నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ క్విజ్ పోటీల్లో 8వ తరగతి చదువుతున్న ఎస్. గీతిక, 9వ తరగతి చదువుతున్న వర్షిణి, పదో తరగతి చదువుతున్న దిలీప్‌కుమార్ జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు ఎంఆర్‌సీ లక్ష్మి, ఏంజెలినా, ఉమా కృష్ణ కుమారి, శేష కుమారి, సురేష్, రత్నాయమ్మ, శ్రీదేవి, కనకరాజులను అభినందించారు. పాఠశాల కమిటీ చైర్మన్ పుష్పాంజలి, వైస్ చైర్మన్ శివప్రసాద్, గైడ్ టీచర్ విజయ్‌కుమార్, సుకేషిని తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్టాళ్ల పేరుతో దందా!

బాణ సంచా దుకాణాల ఏర్పాటు పేరుతో భారీ దందా జరుగుతోంది. కొందరు కూటమి నాయకుల సహకారంతో ఈ దందాకు తెరలేపారు. గతంలో స్టాళ్ల ఏర్పాటు సజావుగా సాగినా ఈ ఏడాది కూటమి నేతల జోక్యం పెరిగింది. జీవీఎంసీ, పోలీసు అధికారుల అనుమతులు రావాలంటే తాము చెప్పినంత చెల్లించాలని వసూళ్లు చేసినట్టు పలువురు పేర్కొంటున్నారు. కొందరు కూటమి నాయకులు అక్రమ వసూళ్ల కోసం వ్యాపారులను ఇబ్బంది పెట్టినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆదర్శ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న బాణసంచా స్టాళ్లు

- ఒక్కో దుకాణం నుంచి రూ.60 వేల వరకు వసూలు?
- అధికార పార్టీ నాయకులకు వాటాలు

గాజువాక: గాజువాకలో దీపావళి సామగ్రి దుకాణాల ఏర్పాటు పేరుతో కొంతమంది వ్యక్తులు భారీ దందా చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల సహకారంతో మరో ఇద్దరు లక్షల్లో వసూలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దీపావళి సందర్భంగా బాణ సంచా విక్రయాలకు స్థానిక ఆదర్శనగర్ గ్రౌండ్‌లో 50 దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి జీవీఎంసీ అధికారులు అనుమతులు జారీ చేశారు. ఈ దుకాణాల్లో సోమవారం నుంచి అమ్మకాలు ప్రారంభించనున్నారు. దీనికోసం వ్యాపారులు మధ్యవర్తులకు భారీ మొత్తంలో ముట్టజెప్పినట్టు తెలిసింది. ఒక్కో దుకాణం నుంచి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేసినట్టు చెబుతున్నారు. ఈ దందాలో ఇద్దరు వ్యక్తులు కీలకపాత్రగా ఉన్నట్టు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఒక కార్పొరేటర్, మరో నాయకుడి సహకారంతో వారు ఈ వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. వసూలు చేసిన మొత్తంలో రూ.20 వేలు అధికార పార్టీ నాయకులకు ముట్టజెప్పగా, మిగిలిన మొత్తంలో వివిధ శాఖల అనుమతులు, ఏ శాఖ నుంచీ ఇబ్బంది లేకుండా చూసుంటామని ఆ ఇద్దరు మధ్యవర్తులు ఈ వసూళ్లు చేసినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వారిలో ఒకరు 40 దుకాణాలను, మరొకరు 10 దుకాణాలను కేటాయించుకొని దందా కొనసాగించినట్టు తెలిసింది. ఈ ఇద్దరు వ్యక్తులే అన్ని శాఖల నుంచి లాబీయింగ్ చేశారని చెబుతున్నారు. బాణసంచా వ్యాపారులకు ఎలాంటి సంబంధం లేకుండా మొత్తం కార్యక్రమం తమ భుజాలపై వేసుకొన్నట్టు ప్రచారం సాగుతోంది. అధికారికంగా 50 దుకాణాలకు అనుమతులు జారీ చేయగా, అనధికారికంగా మరో 20 దుకాణాలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. వారివద్ద కూడా భారీగా వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇంత మొత్తంలో వసూలు చేయడంతో వ్యాపారులు బాణ సంచా ధరలు విపరీతంగా పెంచి కొనుగోలుదారులపై భారం వేస్తారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌కు దీపావళి శోభ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న దీపావళి సామగ్రి



విక్రయానికి సిద్ధంగా ప్రమిదలు

పెదగంట్యాడ: మట్టి ప్రమిదలు వాడడం ద్వారా దైవశక్తులను ఆకర్షించిన వారవతారని పండితులు చెబుతున్నారు. దీంతో దీపావళి పండగకు మట్టి ప్రమిదల విక్రయాలు జోరందుకున్నాయి.మండల పరిధిలో పెదగంట్యాడ, నడుపూరు, దయాల్ నగర్, నెల్లిముక్కులో తయారు చేసిన ప్రమిదలను తెచ్చి మండలంలో అన్ని ప్రాంతాలవ్లో విక్రయిస్తున్నారు. చిన్న మట్టి ప్రమిదలు డజన్ రూ.30 నుంచి రూ.40 వరకు, పెద్దవి రూ.50 నుంచి 60 వరకూ అమ్ముతున్నారు. కొన్ని చోట్ల కళాత్మకమైన ప్రమిదలు డజను రూ.80 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు.

ఊపందుకున్న బాణసంచా విక్రయాలు

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెం ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల వద్ద బాణసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. ఇక్కడ అయ్యన్ దీపావళి సామగ్రి విక్రయిస్తున్నట్టు యజమాని ప్రసాదరావు తెలిపారు. కాలుష్యాన్ని తక్కువగా వెదజల్లే గ్రీన్ క్రేకర్స్ అమ్మకాలు తమ ప్రత్యేకత అన్నారు. నాతయ్యపాలెంతో పాటు, బోయపాలెం, దేశపాత్రునిపాలెంలో విక్రయాలు చేస్తున్నట్టు చెప్పారు.



ప్రమిదలు విక్రయిస్తున్న మహిళ

భక్తిశ్రద్ధలతో త్రిశూలం ప్రతిష్ట



త్రిశూలం ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి తదితరులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి గ్రామ దేవత కుంచుమాంబ ఆలయ ఆవరణలో ఆదివారం త్రిశూల ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 100 కిలోల ఇత్తడి లోహంతో 20 అడుగుల ఎత్తులో రూపొందించిన త్రిశూలాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మాజీ లెమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. జలాభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వడ్లపూడి గ్రామ నాయకులు ముద్దపు దామోదర్, బొండా గోవిందరాజులు, దుగ్గపు దానప్పలు, గాలి నూకరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- త్రిశూలం ప్రతిష్ఠ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ఆడారి శ్రీను, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అంధకారంలో ఆటోనగర్ సిగ్నల్ పాయింట్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్‌లో అంధకారం రాజ్యమేలుతుంది. సిగ్నల్ వ్యవస్థ సైతం పనిచేయకపోవడంతో ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని వాహన చోదకులు భయపడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించే ట్రాఫిక్ సిబ్బంది సైతం చీకట్లో ట్రాఫిక్ నియంత్రించలేక అవస్థలు పడుతున్నారు. యాక్సిడెంట్ జోన్‌గా గుర్తింపు ఉన్న సిగ్నల్ పాయింట్ వద్ద లైట్లు వెలగకపోవడంతో భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఒకవైపు ఆటోనగర్‌కు వచ్చే భారీ వాహనాలు, గాజువాక నుంచి ఎస్‌ఏడీ వైపు వెళ్లే వాహనాలు, ఎస్‌ఏడీ నుంచి గాజువాక, ఆటోనగర్‌కు వెళ్లే వాహనాల రాకపోకలతో ఈ కూడలి రద్దీగా ఉంటుంది. అలాంటి సిగ్నల్ పాయింట్‌లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సిగ్నల్ పాయింట్ వద్ద లైట్లు వెలిగేటట్లు చూడాలని కోరుతున్నారు.



చీకటి మయంగా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్

క్రీడలతో మానసిక ఉల్లాసం



బెంచ్ ప్రెస్ అండ్ డెడ్ లిఫ్ట్ పోటీలను ప్రారంభిస్తున్న న్యాయవాది అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. శ్రీ హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో ఏపీ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, కార్యదర్శి మరల భాస్కరరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో నిర్వహించిన బెంచ్ ప్రెస్ అండ్ డెడ్ లిఫ్ట్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందించనున్నామన్నారు. అధిక బరువులు ఎత్తిన మాస్టర్ మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులకు స్ట్రాంగ్ మెన్ అవార్డుతో పాటు నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు వచ్చే నెలలో పంజాబ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పేర్ల సత్యాలు, రమేష్ యాదవ్, పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యవలసలో ఎమ్మెల్యే పర్యటన



కొండయ్యవలసలో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల కిందట వాటర్ పైప్‌లైన్ పగిలిపోయి నీటిసరఫరాకు అంతరాయం కలిగిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటిసరఫరా విభాగం సూపర్‌వైజర్ సూర్యనారాయణ, స్థానిక నాయకులు కర్రి దేశేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ, బండారు చందు, కసిపల్లి శ్రీనివాసరావు, వడ్డాది శ్రీను, సింగిడి సింహాచలం, పలకా అచ్యుత్ మజ్జి శ్రీను, బలిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు దశదిశలా విస్తరింపచేయాలని, విద్యార్థులంతా భాగస్వాములు కావాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా కార్యదర్శి దాసరి వేణు గోపాల్ కోరారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, అబ్దుల్ కలామ్ యూ ఆర్ గ్రేట్ ఓపెన్ టీం, మదర్ థెరిసా ఓపెన్ రేంజర్ టీం ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆదివారం తాటిచెట్లపాలెంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి షరీఫ్ కుమార్, ఏఎస్‌వోసీ అహ్మద్ షరీఫ్, ట్రైనింగ్ కౌన్సిలర్ గుండి జానకి రాము, గైడ్ కెప్టెన్ పి.వాణి, రేంజర్ లీడర్ నజ్మా భాను, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి మీద మిద్దె తోటలు పెంచాలి



మర్రిపాలెంలో మిద్దె తోటలో మహిళలు

మర్రిపాలెం : ప్రతి ఇంటి మీద మిద్దె తోటలు పెంచాలని వనమాలి, సీటీజీ సంస్థలు ఆదివారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా మర్రిపాలెంలో గ్రీన్ క్లెమైట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జీవీ రత్నం ఎకో వైజాగ్‌లో భాగంగా ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ప్రతినిధులు అరవల అరుణ, మళ్ల సరిత, నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రతీ నెలా నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుషిత మందులతో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వల్ల అనారోగ్యం కలుగుతుందని హెచ్చరించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మర్రిపాలెం, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి మీద మిద్దె తోటలు పెంపకం వివరాల కోసం 77949 30439, 85008 74103లో సంప్రదించాలని కోరారు.